ఆశల పిలుపు

– పి. శివ శంకర్

మా కుగ్రామంలో నా పద్దెనిమిదేళ్ళ వయస్సులో...

మట్లాడటానికి బిడియమూ, అభిప్రాయాలని వెల్లడించలేని మూగతనమూ నన్ను ఆవరించి వుండేవి. కాని లెక్కల్లో చురుకుదనమూ, బొమ్మలు గీయటంలో నేర్పూ...నన్ను ఎక్కువ మంది సన్నిహితంగా పలకరించడానికి ఉపయోగపడేవి. ఆ క్రమంలో నేనెప్పుడు కనిపించినా పలకరించి నవ్వుతూ, నవ్వులో హృదయాన్ని ఒలికిస్తూ, జవాబుగా నవ్వలేని నా మూగ చిరునవ్వుని చూసి కవ్విస్తూ, ఇంకా ఇంకా నవ్విస్తూ...నా నిశ్శబ్దపు ఛాయల్లో ఆమెకు కావాల్సిన సమాధానాల్ని వెదుక్కుంటూ వుండే ఓ దూరపు బంధువులమ్మాయి 'చిన్నారి' వుండేది. వరసకు మరదలు. తన నవ్వు నాకిష్టమేగాని ఆ నవ్వుని భరించటం కష్టమయ్యేది. హృదయపు లోతుల్ని పెంచుకుంటూ పోయే ప్రణయావేశపు ఊసుల్ని నవ్వులుగా చెప్పేది. నా 'ఆలోచన మీద నవ్వుల్ని కప్పేది. నా వ్యక్తిగత సమస్యల మీద ఓదార్పుని పరిచేది. ఊపిరాడక దూరాన్ని పాటించేవాడిని.

చీకటిపడేవేళ పిల్లలు బడిలో యిచ్చిన హోమ్ వర్క్ చేసుకునేందుకు చిన్నారి వాళ్ళ పక్క యింటికి చేరేవారు. నేను అక్కడకు వెళ్ళినపుడల్లా వాళ్ళ హోం వర్క్ పూర్తి చెయ్యటం నాకు తప్పేది కాదు.

ఓ రోజు పిల్లల మధ్య కూర్చొని లెక్కలు చెప్పటంలో బిజీగా వున్నాను. మత్తెక్కించే పరిమళపు గుబాళింపు లెక్కల్ని ప్రక్కకి నెట్టేస్తూంది. ఎక్కడ నుంచి వస్తుందోనని అందరి వైపు చూసాను. చిన్నారి నా వెనకే కూర్చొని వుంది. నేను తన వంక చూడగానే కళ్ళను మెరిపించి, మెత్తగా నవ్వుతోంది. తలనిండా మల్లెపూలు పెట్టుకుంది. నా గుండె మెలిపడింది మల్లెలు ఎంత శక్తిగలవో...

మల్లెల గురించి ఓ కవి వ్రాసిన మాటలు గుర్తొచ్చాయి.

''మల్లెపూలు
మనస్పర్థల ముభావం నుంచి
రాత్రి ఏకాంతంలోకి లాక్కెళ్ళే పూలు
గది మసక చీకట్లో చుక్కలయ్యే పూలు...''

ఒక్క మల్లెలకే అంత శక్తివుంటే దానికితోడు మల్లె చెండులాంటి ఆమె నవ్వు. ఒక్క పువ్వు ఇవ్వవా?'' ఆమె చెవి దగ్గర మెల్లగా అన్నాను.

ఇవ్వనన్నట్టు తల అడ్డంగా వూపింది.

''ఎందుకని?'' అన్నాను.

''మల్లెపూలంటే మాటలా?'' అన్నది.

అన్ని కాలాల్లో దొరకవనో లేక మత్తుగలవనో...ఏ అర్థంలో అన్నదోగాని నిజంగా మల్లెలంటే మాటలు కాదుమరి.

నన్ను యిష్టపడే అమ్మాయి అలా అంటే ఆశ్చర్యమేసింది.

''ఫర్వాలేదు. ఒక్కటంటే ఒక్కటి చాలు'' అన్నాను.

''నేనివ్వను. కావాలంటే నువ్వే వాసన చూడు'' అంది.

అసలు సంగతి అర్థమయ్యింది. కాని నాకు బిడియం, చొరవ లేదు. ఆమె నాకై సాగే ప్రవాహం.

కాబట్టి తొందర పడకూడదనిపించింది నాకు. తర్వాత లెక్కల్లో పడ్డాను.

ఊరించే చిన్నారి నుంచి దూరంగా వుండాలనుకుంటూనే అప్రయత్నంగా అప్పుడప్పుడూ తన దగ్గరకు వెళ్ళే వాడిని. ఆగిపోయిన నా చదువు గురించి బాధపడేది. చదువు మానొద్దనేది. నా చదువు పూర్తయ్యేదాకా తనూ చదువుతాననేది. ఇప్పుడు తను చదువుతున్న పదో తరగతి అయిపోగానే పది మైళ్ళ దూరంలో గల కాలేజీకి వాళ్ళ నాన్న పంపడని తనకు తెలుసు. చదువు అవ్వగానే వెంటనే పెళ్ళి చేస్తారని తన భయం. అందుకే ఎలాగైనా మొండికేసి చదవాలనుకునేది.

పిల్లలందరికీ సంవత్సరాంతపు పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

చిన్నారి కూడా శ్రద్ధగా చదువుతోంది.

ఓ రోజు—

వాళ్ళ మధ్య కుర్చీలో కూర్చొని వున్నాను. పిల్లలు ఒక్కొక్కరు వాళ్ళు పాసైతే ఏమేమి ఇవ్వదలచారో చెబుతున్నారు. తమాషాగా వింటున్నాను. వాళ్ళు ఏదో ఇస్తారనే ఆశకన్నా వాళ్ళ కృతజ్ఞతకి ముచ్చటేసింది.

చిన్నారి నా కుర్చీ వెనుకే నుంచొని వుంది. రాని లెక్కేదో చెప్పించుకుంటోంది. తానేది చెప్పించుకోవాలన్నా ముందుకొచ్చి నిలబడదు. కుర్చీ వెనుక చేరుతుంది. ఎదురుగా నవ్వితే ఇక నేను పాఠం చెప్పలేనేమో...

''మరి నేనేమివ్వాలో...'' కుర్చీమీద రెండు చేతులేసి నా మీదకు వంగి మాట్లాడుతోంది. తనలా వున్నప్పుడల్లా నాకు గర్వంగా వుంటుంది. ఆనంద స్రోత్రమేదో మూలాన్ని వెదుకుతు స్ఫుటుంటుంది.

''ఏమిస్తావు?'' అన్నాను.

''నేను చెబితే నాకు తృప్తి తీరదు. నువ్వే చెప్పు.''

''నాకు ఆశలెక్కువ. ఏమడగాలో...''

''ఏమైనా''

''ఏమైనా సరేనా!''

''ఆ! నీ యిష్టం''

తీరని కోరిక

ఆ మూల
రిథమిక్‌గా వెలిగి, మలిగే
రంగురంగుల లైట్లు
సప్తస్వరాలై నిశ్శబ్ద సంగీతాన్నిస్తాయి.
సంవత్సరానికు సలాం చేస్తూ స్వాగతం చెప్తాయి.
కార్లు బార్లు తీరుతాయి
కారు దిగి వాళ్ళు నడుస్తుంటే
దేవతా వస్త్రాల్లో
గంధర్వులు గుర్తుకొస్తారు.
నాలుగడుగులు వాళ్ళనా గదికి చేరుస్తాయి.
'సీ షోర్' చల్లదనం
ఆ గదిలో బందీయై వుంటుంది.
సుతారంగా చేతులు
కప్పులు సర్దై చేస్తాయి.
కడుపులో వున్న కాస్త ఖాళీ ఎండుతుంది.
మూతి చుట్టు పూతలలో పిల్లలు
వెన్నదొంగల్లా కన్పిస్తారు.

అద్దాల్లోంచి రిఫ్లెక్టయిన మన చూపులు
లాలాజలోత్పత్తిని పెంచుతాయి.
పేగులో జఠరం మరుక్కున కాలుతుంది.
వాళ్ళు తినే కప్పెడు ఐస్‌క్రీం విలువ
మన దిన వేతనాన్ని డామినేట్ చేస్తుంది.
వాళ్ళిచ్చే పచ్చనోట్లు

చమట వాసన్తో తమ కేరాఫ్ చెప్తాయి.
రాత్రి కలలో నేను
టబ్బు సైజు కప్పులో తెల్లని
మబ్బుల్ని తింటున్నాను.
తింటున్నానే కాని తరగడం లేదు
వాళ్ళ కోరిక తీరడమూ లేదు.

—దోర్న మోహన్

తను ఏమైనా యిస్తుందని తెలుసు. ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. రూఢి కోసమైనా అడగ టమెందుకు? అడగకుండా యిచ్చింది గొప్పగా వుంటుంది. కాని జవాబుగా ఏదో ఒకటి చెప్పాలి. హృదయ మివ్వమని అడగాలా? హృదయాన్ని ముందరే పరిచింది. ప్రేమనివ్వమని అడగాలా? ఎంత ప్రేమ కురిపిస్తుందో...

"ప్రేమించాను నిన్ను, నా హృదయం నీది" ఇలాంటి మాటలు సాక్ష్యం కోసమేగాని హృదయ మంతటనీ తెలుపలేవు. తెలుపాలంటే మాటలకి సాధ్యం కాదు. ఒక్క చూపు, ఒక్క సన్నివేశం చాలు. ప్రేమించే హృదయానికి చాలా నమ్మకా న్నిస్తుంది. సాక్ష్యం కన్నా నమ్మకం బలమైంది. ముద్దు ఇవ్వమని అడగాలా?

హృదయాన్ని వెలిగించటానికి ముద్దు కావా లిగాని, ఒక్క నవ్వుతోనే వెలిగిన హృదయాన్ని వెలిగించేదేముంది? ఏమడగాలో వాకు చేతకాదు.

"నువ్వు పాసైన తర్వాత అడుగుతానులే" అన్నాను.

తను వేసిన పజిల్‌ని విప్పకుండా తప్పించు కున్నందుకు నన్నగా నవ్వి "సరే" అంది.

పరీక్షలు అయిపోయాయి. చిన్నారి శలవుల్లో బరధువుల వూరెళ్ళింది. పదో తరగతి పరీక్షా ఫలితాలొచ్చాయి. పాసైంది. తిరిగి తను మా వూరు రాకముందే నా చదువు నిమిత్తం ఊరొదిలి వెళ్ళాను. దసరా శలవులకి మా వూరొచ్చినప్పుడు నన్ను చూసి కూడా చూడనట్లు ప్రవర్తించేది.

ఈ మార్పుకి కారణం తనకి ఇంట్లో వాళ్ళు సంబంధాలు చూస్తున్నారని తెల్పింది. చిన్నారి మాట్లాడకుండా దూరంగా తప్పుకోవటంపట్ల ఆశ్చర్యమేసింది. నా హృదయం తిరగబడింది. మాట్లాడాలంటే కనిపించదు.

బాధ అక్షర రూపం దాల్చింది.

"పలకరింపుల పూలతో
ప్రణయ పరిమళాలు వెదజల్లి
ఊరుకున్న ఆశలను ఉసిగొలిపి
దోబూచులాడి
దొరకని దావవై, మాయని గాయమై
ఎందుకున్నావో..."

వేదనొక్కటే మిగిలింది. చిన్నారి పెళ్ళి సంబంధం స్థిరపడింది. మాట్లాడాలనే తపన ఎక్కువయింది.

నా నిరీక్షణ ఫలించి ఓ చల్లని వేళ మాకు ఏకాంతాన్నిచ్చింది.

నేను గడప ముందు నిలబడ్డాను. తను గడప లోని కర్టెన్‌ని పట్టుకుని నిలబడింది. నా నోట వెంబడి మాట రాదు.

తను ఏడుపు నాపుకోలేక తల వంచుకుంది. కన్నీరు గడప మీద పడి, చింది, ఇద్దరి కాళ్ళ మీదా పడుతున్నాయి. నా కళ్ళు బరువెక్కి చెక్కిళ్ళ మీద ఒరుగుతున్నాయి. హృదయంలో తడి సంచలనానికి నిలవలేక తెల్లని కర్టెన్‌ని ముఖానికి లాక్కుంది. కర్టెన్ తడుస్తూంది. వంగి ఆ కర్టెన్‌తోనే తన కన్నీటిని తుడి చాను. నేను వంగినపుడు ఒక చెయ్యి నా మెడ మీద వేసి, మరో చేతితో నా తలనిమిరి,

కర్టెన్ ముసుగు నుంచే నా నుదురుని ముద్దు పెట్టుకుంది. వెంటనే

"క్షమించు" అంది.

నవ్వుతో వెలిగిన హృదయం, ముభావంతో భగ్గుమంది. ఇప్పుడు ఆరిపోయింది. దిక్కు తోచక ఏకాంతం నుంచి మౌనంగా బయటకొ చ్చేశాను. తర్వాత కనిపించినప్పుడు పలుకరించి మాట్లాడింది.

తన పెళ్ళి అయ్యింది. రెండు మూడు సార్లు ఒంటరిగా ఎదురుపడినా తలవంచుకుని వెళ్ళిపో యింది.

రెండు సంవత్సరాలు గడిచాయి.

నా చదువు పూర్తయింది. మా వూళ్ళోనే వుంటున్నాను.

తను అత్తగారింటి నుంచి వచ్చిందని, నాలుగు రోజులుంటుందని చిన్నారి వాళ్ళ అమ్మ బజార్లో ఎదురుపడి చెప్పింది. ఆమెతో పాటే వాళ్ళ యింటికి వెళ్ళాను వసార్లో మంచం మీద పడు కుంది.

నన్ను చూసి కళ్ళు మూసుకుంది. వాళ్ళ అమ్మ చిన్నారిని తట్టి "అబ్బాయి వచ్చాడే" అంది.

బలవంతంగా నన్ను చూసింది.

"బాగున్నావా చిన్నారీ!" అన్నాను.

"ఊ బాగానే వున్నాను" ముక్తసరిగా అని కళ్ళు మూసుకుంది.

"అబ్బాయి వస్తే మాట్లాడకుండా పండుకు న్నావేంటే" అని వాళ్ళ అమ్మ మందలించింది. తను మాత్రం కళ్ళు తెరవలేదు. నాకు చిరా కేసి వచ్చేశాను.

కాల పరంపరలో తర్వాత అంతకన్నా గొప్ప వ్యక్తిత్వమున్న వాళ్ళు తారసపడి, నన్ను ఇష్టపడినా, దూరమయినా మొదటంత తీవ్రమైన స్పందనా, వేదనా లేవు. అందుకే ఇప్పుడనుకుంటాను.

"తొలిగా హృదయం వెన్నముద్దలాంటిది. వలపు సెగలాంటిది. సెగకు వెన్న కరిగి నెయ్యి అవుతుంది. సెగలేకపోతే నెయ్యి పేరుకుంటుంది. పేరుకున్న నెయ్యికి మళ్ళీ సెగ తగిలితే మళ్ళీ కరిగి నెయ్యి అవుతుంది. సెగలేకపోతే పేరుడు నెయ్యి అవుతుందే తప్ప వెన్నముద్ద కాలేదు హృద యమూ అంతే."